PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :284 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం. 08.11.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy

Circulated by All Districts of Telangana and Andhra Pradesh



ఇ20 పెట్రోల్‌పై మోదీ సీమాధానం చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ..



న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు: ఇ20 పెట్రోల్ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. ఇ20 పెట్రోల్‌లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉందని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించడంతో వివాదం మొదలైంది. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి పలు సూటి ప్రశ్నలు సంధించారు.ఈ సందర్భంగా పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ కేంద్రంపై ఎంపీ రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో 20 శాతం మాత్రమే ఇథనాల్ ఉందని కేంద్రం చెబుతుండగా.. వాస్తవంగా అంతకంటే ఎక్కువ మోతాదులో కలుపుతున్నట్లు ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల నుంచి సేకరించిన పెట్రోల్ నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా.. ఈ విషయం బయటపడిందని తెలిపారు. మొత్తం 14 నమూనాలకు గానూ 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని రాహుల్ వెల్లడించారు. ఈ పరీక్షల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియంలో 30.5 శాతానికి మించి ఉన్నట్లు వెల్లడైందన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎస్‌తో పాటు ప్రైవేటు సంస్థలైన నయారా, షెల్ కంపెనీల పెట్రోల్ నమూనాల్లోనూ నిర్దేశిత 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ ఉందని రాహుల్ ఆరోపించారు. ఆయా కంపెనీల సొంత ప్రయోగశాలలు మాత్రం దీనిని వెల్లడించలేదని విమర్శించారు. పెట్రోల్‌లో అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆగ్రహించారు. దీని వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతో పాటు తరచూ మరమ్మతులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అధిక ధర చెల్లించి పెట్రోల్ కొనుగోలు చేస్తున్న ప్రజలకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న ఇంధనంలో ఎంత శాతం ఇథనాల్ ఉందో తెలిపే సమాచార వ్యవస్థ కూడా అందుబాటులో లేదని మండిపడ్డారు.


ధరణి అక్రమాలపై సీఐడీ కొరడా

15 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు

- మరో ఐదుగురు అదుపులోకి
- రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు విస్తృత తనిఖీలు
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో సీఐడీ సోదాలు
- ధరణి ఆపరేటర్లు, డేటా ఎంట్రీ సిబ్బంది విచారణ
- భూ రికార్డుల్లో అక్రమంగా మార్పులు చేసినట్లు అనుమానాలు
- ఇప్పటివరకు తొమ్మిది మందిపై చర్యలు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణకు సంబంధించిన ధరణి పోర్టల్ అక్రమాల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. విలువైన భూముల రికార్డులను అక్రమంగా మార్చి, యాజమాన్య హక్కులను ఇతరుల పేరిట బదిలీ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 15 ప్రత్యేక బృందాలతో రెండు రోజులపాటు ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. తాజాగా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయగా, తాజాగా ఐదుగురిపై చర్యలతో మొత్తం తొమ్మిది మందిపై సీఐడీ చర్యలు తీసుకున్నట్లయింది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లు, డేటా ఎంట్రీ సిబ్బందిని విచారించారు. పోర్టల్‌లోకి అక్రమంగా లాగిన్ అయి భూములకు సంబంధించిన కీలక రికార్డులను మార్చినట్లు ప్రాథమికంగా ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఏయే లాగిన్ ఐడీల ద్వారా మార్పులు జరిగాయి? ఎవరి ఆదేశాలతో ఈ వ్యవహారం నడిచింది? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



కోర్టు ఉత్తర్వుల మాటున భూ రికార్డుల మార్పులు?


ఈ అక్రమాల వెనుక కొత్త తరహా మోసాలకు పాల్పడినట్లు సీఐడీ అనుమానిస్తోంది. ముఖ్యంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలు, కోర్టులు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని రికార్డుల్లో అక్రమ మార్పులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కోర్టు ఉత్తర్వుల ఆధారంగా పోర్టల్‌లో మార్పులు చేయాల్సిన విధానాన్ని కొందరు దుర్వినియోగం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా అత్యంత విలువైన భూదాన్ భూములపై సీఐడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆయా భూములకు అక్రమంగా బైనంబర్లు సృష్టించి, తద్వారా యాజమాన్య హక్కులను ఇతరులకు బదిలీ చేసినట్లు వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో కీలకంగా మారాయి. భూముల అసలు రికార్డులు, పోర్టల్‌లో నమోదైన వివరాలు, మార్పులకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

మరింత మంది పాత్రపై ఆరా

ఈ వ్యవహారంలో కేవలం క్షేత్రస్థాయి ఆపరేటర్లు, డేటా ఎంట్రీ సిబ్బందే కాకుండా, వారికి సహకరించిన ఇతర వ్యక్తుల పాత్రపైనా సీఐడీ ఆరా తీస్తున్నట్లు సమాచారం. భూ యజమానులు, మధ్యవర్తులు, సంబంధిత సిబ్బంది మధ్య జరిగిన లావాదేవీల వివరాలను విశ్లేషిస్తున్నారు. అక్రమంగా మార్చిన రికార్డుల ఆధారంగా ఎవరెవరు లబ్ధి పొందారు? భూముల క్రయ విక్రయాలు జరిగాయా? అనే అంశాలపైనా దృష్టి పెట్టారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సీఐడీ ఉన్నతాధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న వారిని విచారిస్తూ, సేకరించిన సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అవసరమైతే మరి కొందరిని కూడా అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో భూ రికార్డుల మార్పులు, బైనంబర్ల సృష్టి, యాజమాన్య హక్కుల బదిలీ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించడమే లక్ష్యంగా సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. రానున్న రోజుల్లో ఈ కేసులో మరిన్ని అరెస్టులు, కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

ఎండిన పంటలు

కన్నీటి సంద్రంలో రైతులు



- 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: హరీశ్‌రావు
- పంట నష్టంపై సర్వే చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్
- ధాన్యం కొనుగోళ్లకు మిల్లుల కేటాయింపులు పూర్తి చేయాలని లేఖ

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

తెలంగాణలో కరువు పరిస్థితులు రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల ప్రభావంతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో శ్రమించి పెట్టుబడులు పెట్టిన రైతులకు చివరకు పంట చేతికందకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయారని తెలిపారు. ఇప్పటికే నష్టాల ఊబిలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎండిపోయిన పంట పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పంటల వారీగా నష్టం వివరాలను సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

మరోవైపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సక్రమంగా సాగడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం, మిల్లుల కేటాయింపుల్లో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, మిల్లుల అలాట్‌మెంట్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బిల్లుల పెండింగ్‌తో కొనుగోళ్లకు ఆటంకం

మార్కెటింగ్ శాఖలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అధికారులు, సిబ్బంది ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారకూడదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది, గన్నీ సంచులు, రవాణా, తూకం వంటి సౌకర్యాలను సకాలంలో కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.పంట నష్టపోయిన రైతులను పక్క రాష్ట్రాలు ఆదుకుంటుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, ఎండిపోయిన పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి నష్టపోయిన వారందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి, మిల్లుల కేటాయింపులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను పరిష్కరించి, ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. రైతులు అప్పులపాలై ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖలో హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు

ఇందిరమ్మ ఇళ్లే నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు: మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా, నవంబరు 7 ప్రభాత సూర్యుడు దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

7-వా సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ...





భద్రాచలం, నవంబర్ 07 ప్రభాత సూర్యుడు భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7-వా సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహకులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు శు భాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుకృషి, స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం డివిజన్ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 7 ప్రభాత సూర్యుడు భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు గిరిజన కుటుంభాలు ఆనందంగా దీపావళి పండుగ జరుపుకోవాలని వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ఠ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుమూల ప్రాంతాలలో రెవెన్యూ డివిజన్ పరిధిలో మండల రెవెన్యూ కార్యాలయాలలో పనిచేస్తున్న తాసిల్దార్లు, సిబ్బంది ప్రజలందరు బాణాసంచా మందు గుండు సామాగ్రి, పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని తెలుపుతూ అందరికీ మరి ఒకసారి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

ఇటుక బట్టీలపై అధికారుల మౌనం ఎందుకు.?

గత కథనం ప్రచురితమైన కథలని యంత్రాంగం.?
అనుమతులపై విచారణ ఏది చర్యలేవి.?
జిల్లా ఉన్నత అధికారుల జోక్యానికి ప్రజల డిమాండ్.?
మామూళ్ల అందుతున్నాయని ఆరోపణపై స్వతంత్ర విచారణ జరిగేనా.?
ఇసుక బూడిద తరలింపునకు సంబంధించిన ప్రభుత్వ ఆదాయ వివరాలపై విచారణ చేపట్టాలి.?
తాసిల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టకపోవడం పై ప్రశ్నలు.



పినపాక, నవంబర్ 7 ప్రభాత సూర్యుడు మండల పరిధిలోని ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా కొనసాగుతున్న ఇటుక బట్టీల వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. మండల వ్యాప్తంగా సుమారు ఐదు ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నప్పటికీ, వాటికి సంబంధించిన అనుమతులు, ప్రభుత్వ నిబంధనల అమలుపై అధికారుల నుంచి స్పష్టత కరువైంది. ఈ వ్యవహారంపై గతంలో వార్తలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 0ఇటుక బట్టీల నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? పర్యావరణ, రెవెన్యూ శాఖల నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ముఖ్యంగా తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను వెల్లడించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బట్టీల నిర్వహణకు సంబంధించిన అనుమతుల వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.మరోవైపు ఇటుక తయారీకి వినియోగిస్తున్న ఇసుక, బూడిద తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు, ఇతర ఆదాయ వివరాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి రుసుములు చెల్లించకుండా ఇసుక, బూడిద తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా? అనే కోణంలో విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇటుక బట్టీల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలెంత అన్నది అధికారిక విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత శాఖలతో సమగ్ర విచారణ జరిపిస్తారా? లేక గతంలో మాదిరిగానే ఈ వ్యవహారాన్ని పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.సమగ్ర తనిఖీలు చేపట్టి, అనుమతులు లేని బట్టీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి సంబంధించిన లెక్కలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఏజెన్సీ ఏరియా లోని గిరిజనులకు, ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్



భద్రాచలం అక్టోబర్ 7 ప్రభాత సూర్యుడు దీపావళి పండుగను సంస్కృతికి ప్రతిబింబంగా జరుపుకునేది పండుగలని, వాటిలో ఆనందోత్సాహాలతో జాతి, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగ దివ్య దీపాల దీపావళి అని ఈ పండుగను ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిలుగు వెలుగుల రంగుల దీపావళి చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందంగా జరుపుకోవాలని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని ఆదివాసి గిరిజన కుటుంబాలు దీపావళి పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారని, ఈ పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని, నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతని పీడ వదిలిన ఆనందంతో ప్రజలు దీపావళి పండుగ చేసుకుంటారని అలాగే లంకలో రావణుని సంహరించిన శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య దీపావళి చేసుకున్నారని, చీకటిని పారదోలుతూ వెలుగులోనికి తెచ్చే పండుగగా విజయానికి ప్రతీకగా ప్రజలు దీపావళి పండుగను చేసుకుంటారని ఆయన తెలుపుతూ, గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో పనిచేయుచున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు కళాశాలలో విద్య నభ్యసిస్తున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ప్రిన్సిపాల్ లకు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయుచున్న ఉద్యోగులకు వారి కుటుంబాలకు అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని, ముఖ్యంగా పిల్లలు టపాసులు, బాణాసంచలు ఇతర మందు గుండు సామాగ్రి విషయంలో జాగ్రత్తలు పాటించేలా తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆయన తెలుపుతూ మరి ఒకసారి అందరికి దీపావళి పండుగ శుభాకాంక్షలు అని ఆయన అన్నారు.

ధైర్య సాహసాలకు నిదర్శనం, నిస్వార్థ సేవకు వందనం

విపత్తులను ధైర్యంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించిన హీరోలకు ఘన సన్మానం భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ





భద్రాచలం నవంబర్ 7 ప్రభాత సూర్యుడు వర్షాకాలంలో భద్రాచలంలోని గోదావరి వరదలు అకస్మాత్తుగా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమ యొక్క విధులను మొక్కవోని ధైర్యంతో వరద ప్రాంతాలలో పనిచేసి ప్రజలకు వరదల బారి నుండి తన ఉద్యోగ ధర్మాన్ని ధైర్య సాహసాలతో నిర్వహించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేయడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ఠ అన్నారు. శనివారం తన చాంబర్లో గోదావరి వరదలు, భారీ వర్షాలు, శ్రీరామ నవమి, ముక్కోటి, గణేశ నిమజ్జనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం వంటి విపత్తు నహాయక చర్యల నమయంలో అంకితభావంతో పనిచేసిన ఫ్రంట్‌లైన్ సిబ్బంది,

– ఈతగాళ్లు: కుమ్మర సత్యనారాయణ, కారుకు ప్రసాద్
– పారిశుధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ, భద్రాచలం: శ్రీమతి. సుడాల కౌసల్య, శ్రీమతి. సామంతుల పుష్ప
– ఆశా వర్కర్: . గొర్రెముచ్చు రమాదేవి, ఏ ఎం సి కాలనీ సబ్-సెంటర్
– హోంగార్డు: పానుగంటి రమేష్, అగ్నిమాపక కేంద్రం లలో పనిచేసే సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎటువంటి విపత్తులైన ధైర్యంగా ఎదుర్కొని ప్రజలను కాపాడుకుంటూ విధులు నిర్వహించిన సిబ్బందిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా సిబ్బంది కూడా ఈ విధమైన సేవలు అందిస్తే గోదావరి వరదలలో ఎటువంటి ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం కానీ జరగదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ భగవాన్ రెడ్డి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో ఘనంగా దీపావళి వేడుకలు!

రావోజితండాలో లబ్ధిదారుడి ఇంట్లో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం



కారేపల్లి,నవంబర్ 7 ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సింగరేణి మండలం రావోజితండా గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు బానోతు బద్రు ఇంట్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పోస్టర్‌ను ఆవిష్కరించారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు నిర్వహించడం ద్వారా లబ్ధిదారుల కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో రావోజితండా గ్రామ సర్పంచ్ భూక్య బాలుతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకులగూడెంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ.

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధనకు కృషి చేయాలి. -- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



కారేపల్లి నవంబర్ 7 ప్రభాత సూర్యుడు సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 7న అమరవీరుల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అమరవీరులు కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణతో పాటు ప్రజా ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి నినాదంతో 1969లో నక్సల్బరి ఉద్యమం నుంచి ప్రారంభమైన కమ్యూనిస్టు విప్లవోద్యమం శ్రీకాకుళం, గోదావరి లోయ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు విస్తరించిందన్నారు. భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ఎంతోమంది విప్లవకారులు ప్రాణత్యాగాలు చేశారని, ప్రజల విముక్తి కోసం ప్రాణాలర్పించిన వారంతా విప్లవోద్యమ చరిత్రలో అరుణతారలుగా నిలిచిపోయారని కొనియాడారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, సత్యనారాయణ సింగ్, కాను సన్యాల్, చారు మజుందార్ తదితర ప్రముఖ నాయకులు విప్లవోద్యమ నిర్మాణానికి తమ జీవితాలను అంకితం చేశారని గుర్తుచేశారు. శ్రీకాకుళం, గోదావరి లోయ తదితర ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాల కోసం ప్రాణత్యాగం చేసిన అనేకమంది అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా టేకులగూడెం గ్రామానికి చెందిన కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణలు ప్రజా ఉద్యమాల కోసం చేసిన త్యాగాలు గ్రామ ప్రజలకు, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అరుణోదయ రామారావు, నాగన్న, ఏనుగుల వెంకన్న, జన్ను సార్, శ్రీశైలం తదితరులు కూడా ప్రజా ఉద్యమాల్లో అమరులుగా నిలిచారని తెలిపారు.పేద ప్రజల కష్టాలు, కన్నీళ్లు తొలగించి సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం అమరవీరులు కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా ప్రజల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. పేదలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధన లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు గుగులోతు తేజ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం (ూూూ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్, ఒఖజ× సంయుక్త మండల కార్యదర్శి ధరావత్ సక్రు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొలిసెలం శ్రీను, స్వర్ణపాక అనసూర్య, రామారావు, గుమ్మడి ఎర్రయ్య, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి

అధికారులు సకాలంలో హాజరు కావాలి

ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 7 ప్రభాత సూర్యుడు తేదీ 09 నవంబర్ 26 సోమవారం భద్రాచలం ఐ టి డి ఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ శనివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని వారు తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ మరియు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరాలలో తప్పకుండా హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు..

ఈ ఏడాది వరి సాగుకు దూరంగా ఉండాలి..

తాగునీరు, పశువుల అవసరాలకే తాలిపేరు ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవాలి -- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి వినతిపత్రం





భద్రాచలం, నవంబర్ 07 ప్రభాత సూర్యుడు భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ని కలిసి ప్రాజెక్టు నీటి వినియోగం, సాగునీటి పరిస్థితులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినతిపత్రం అందజేశారు.ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, తాలిపేరు ప్రాజెక్టు పరిధిలో ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేపట్టకూడదని ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత ప్రతినిధులు సూచించారు. వరి సాగు చేపడితే నీటి కొరత ఏర్పడి ఇతర పంటలకు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం తాలిపేరు ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు, పశువుల తాగునీటికి, పశుగ్రాసం సాగు అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి సమస్యలను నివారించేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో జానీ, చర్ల తిరుపతి, భాగ్యరాజు రాథోడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మండల ప్రజలకు దీపావళి

శుభాకాంక్షలు తెలిపిన భూక్య రంజిత్ కుమార్

ప్రతి ఇంటా ఆనందాల కాంతులు విరజిమ్మాలి.. చీకట్లను తొలగించి వెలుగులు నింపే దీపావళి కావాలి



భూక్య రంజిత్ కుమార్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

కారేపల్లి, నవంబర్ 7 ప్రభాత సూర్యుడు చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదేపాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆకాంక్షించారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజలకు ఆయన హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళి పండుగకు విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. దీపావళి కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాకుండా కుటుంబ బంధాలు, ఆత్మీయతలు, సోదరభావం, ఐక్యతను చాటిచెప్పే గొప్ప పర్వదినమని అన్నారు.ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చేతనైన సహాయం అందిస్తూ వారి జీవితాల్లోనూ ఆనందపు వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చే సమయంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పర్యావరణానికి హాని కలగకుండా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటిస్తూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.ఈ దీపావళి ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, అభివృద్ధిని అందించాలని, సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల ప్రజలందరూ సిరిసంపదలతో, సంతోషాలతో వర్ధిల్లాలని

ఖమ్మం జోన్ క్రికెట్ విజేతగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల.

రెండో స్థానంలో యూసీఈ కొత్తగూడెం.. 10 పరుగుల తేడాతో విజయం సాధించిన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ జట్టు



ఖమ్మం నవంబర్ 7 ప్రభాత సూర్యుడు నగరంలోని డెక్కన్ క్రికెట్ మైదానాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఖమ్మం జోన్ అంతర్ కళాశాల క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. యూసీఈ కొత్తగూడెం జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 91 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన యూసీఈ కొత్తగూడెం జట్టు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో 10 పరుగుల తేడాతో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ జట్టు విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జోన్ క్రీడల కార్యదర్శి డాక్టర్ బి. వెంకన్న హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేత ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల క్రికెట్ జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు డాక్టర్ కోటయ్య, గోపికృష్ణ, జే. ఉపేందర్, ఎం.డి. మతిన్ తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గ ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు...

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి.




వైరా, నవంబర్ 7 ప్రభాత సూర్యుడు చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినం వైరా నియోజకవర్గ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దీపావళి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. చీకటిని తొలగించి వెలుగులు నింపే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశలు, ఆనందాలు, అభివృద్ధిని తీసుకురావాలని అన్నారు.ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.అదేవిధంగా బాణసంచా కాల్చే సమయంలో చిన్నారులు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని సూచించారు.ఈ దీపావళి వైరా నియోజకవర్గంలోని ప్రతి ఇంటా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

సినిమాసోర్ట్స్

నాగచైతన్య -వృషకర్మ-కు ఆ ఇద్దరూ పోటీనా?


నాగచైతన్య నటించిన పీరియాడిక్ థ్రిల్లర్ 'వృషకర్మ' డిసెంబర్ 4న విడుదల కానుంది. అదే రోజున సల్మాన్ ఖాన్ 'మాతృభూమి', శ్రద్ధా కపూర్ 'ఈత' చిత్రాలు కూడా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అయితే 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కించిన 'వృషకర్మ'పై తెలుగు రాష్ట్రాల్లో భారీ అంచనాలు ఉన్నాయి. వినూత్న కథాంశం, మేకింగ్‌తో ఈ సినిమా మంచి ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. టాలీవుడ్ యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ పీరియాడిక్ థ్రిల్లర్ -వృషకర్మ- డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఇదే తేదీకి బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన -మాతృభూమి-తో పాటు, శ్రద్ధా కపూర్ ప్రధాన



పాత్రలో రూపొందిన -ఈత- (హిందీ) చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద పోటీకి దిగుతుండటంతో సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. సల్మాన్ ఖాన్, శ్రద్ధా కపూర్ వంటి బిగ్ స్టార్ల చిత్రాలు రేసులో ఉన్నా కానీ.. వీటి ప్రభావం మెట్రోల్లో మల్టీప్లెక్సుల వరకే.. తెలుగు రాష్ట్రాల్లో నాగచైతన్యకు ఉన్న బలమైన ఫ్యాన్ బేస్.. ఇటీవలి సక్సెస్ రేటు.. సినిమాపై ఉన్న విపరీతమైన క్యూరియాసిటీ కారణంగా -వృషకర్మ- అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కంటెంట్ పరంగా -వృషకర్మ- మిగిలిన రెండు చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన పీరియాడిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. గతంలో -విరూపాక్ష- చిత్రంతో మిస్టరీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను తెరపై ఆవిష్కరించి బాక్సాఫీస్ వద్ద రికార్డు విజయాన్ని అందుకున్న దర్శకుడు కార్తీక్ వర్మ దండు.. ఇప్పుడు మరింత వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అతిపెద్ద ప్లస్ పాయింట్‌గా విశ్లేషిస్తున్నారు. ప్రాచీన నమ్మకాలు..మిస్టరీ.. అడ్వెంచర్ నేపథ్యంతో కూడిన విజువల్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని నిర్మాతలు అత్యంత నమ్మకంతో ఉన్నారు. స్క్రిప్ట్ డిజైన్ - మేకింగ్ స్థాయిలోను విరూపాక్షను మించిన హంగులతో ఈ సినిమాను రూపొందించడం బిజినెస్ వర్గాల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ప్రస్తుత సినిమా వాతావరణంలో టాలీవుడ్, బాలీవుడ్ అనే ప్రాంతీయ భేదాలు పూర్తిగా చెరిగిపోయాయి. దక్షిణాది నుండి వస్తున్న వైవిధ్యమైన, నాణ్యమైన కంటెంట్‌ను ఉత్తరాది ప్రేక్షకులు విపరీతంగా ఆదరిస్తున్నారని గడిచిన కొన్నేళ్ల బాక్సాఫీస్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో నాగచైతన్య మార్కెట్ పరిధి కూడా పాన్-ఇండియా స్థాయిలో పెరుగుతోంది. సల్మాన్ ఖాన్ లేదా మరో స్టార్ హీరో సినిమా వచ్చిందంటే ఇతర సినిమాలను చూడకూడదనే పాత ఆలోచనా విధానం (మీమాంశ) ప్రేక్షకులలో ఇప్పుడు లేదు. మంచి కంటెంట్ ఉంటే అన్ని భాషల ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్న తరుణంలో.. మారిన ఈ పాన్-ఇండియా ట్రెండ్ -వృషకర్మ- చిత్రానికి అన్ని విధాలా కలిసివస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓం రౌత్‌ని పదే పదే టార్గెట్ చేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్

నితీష్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం పార్ట్-1' విజువల్స్‌పై ప్రశంసలు వస్తుండటంతో దర్శకుడు ఓం రౌత్‌పై ప్రభాస్ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ప్రభాస్‌తో ఆయన రూపొందించిన 'ఆదిపురుష్'లో రామాయణాన్ని తెరకెక్కించిన తీరును తప్పుబడుతున్నారు. వానరులను గొరిల్లాలుగా చూపించడం, గ్రాఫిక్స్, శ్రీరాముడి పాత్ర చిత్రణలో లోపాలు ఉన్నాయని మండిపడుతున్నారు. 'రామాయణం' చూస్తుంటే 'ఆదిపురుష్'లో జరిగిన తప్పులు గుర్తొస్తున్నాయని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.నితీష్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కిన -రామాయణం పార్ట్-1- ప్రపంచవ్యాప్తంగా విడుదలై విజువల్ గ్రాండియారిటీ పరంగా మెప్పు పొందిన సంగతి తెలిసిందే. ఎమోషన్స్ మిస్సయ్యాయని విమర్శలు వచ్చినా సాంకేతికంగా అద్భుతంగా ఉందని ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ తరుణంలోనే బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్‌పై నెటిజన్లు-ప్రభాస్ అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శల దాడికి తెర తీసారు. రామాయణాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో..సనాతన సాంప్రదాయాల శోభ చెడకుండా



ఎలా తెరకెక్కించ వచ్చో నితీష్ తివారీ నిరూపించారని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదే సమయంలో గతంలో శ్రీరాముడి కథాంశంతో ప్రభాస్ కథానాయకుడిగా ఓం రౌత్ రూపొందించిన -ఆదిపురుష్- విఫలమైన తీరును గుర్తుచేస్తూ ఫ్యాన్స్ మీడియా ఎదుట విరుచుకు పడుతున్నారు. ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ కెరీర్‌ను ఓం రౌత్ -ఆదిపురుష్- రూపంలో దెబ్బతీశారని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పౌరాణిక ఇతిహాసాన్ని తెరకెక్కించే సమయంలో ప్రజల విశ్వాసాలను, ఆలోచనా విధానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా పవిత్రమైన రామాయణంలో వానరాలకు బదులుగా గొరిల్లాలను చూపించడం.. హాలీవుడ్ స్టైల్ డార్క్ షేడ్స్‌ను అనుకరించడం వంటి నిర్ణయాలు సినిమా ఆత్మను దెబ్బతీశాయని వారు ప్రధానంగా వేలెత్తి చూపుతున్నారు. -రామాయణం-లాంటి ఒక నిజమైన విజువల్ గ్రాండియర్ కాన్వెప్టులో ప్రభాస్ నటించి ఉంటే ఆయన రేంజ్ మరోలా ఉండేదని ఫ్యాన్స్ భావిస్తున్నారు.అంతేకాకుండా శ్రీరాముడిగా ప్రభాస్ క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడంలో ఓం రౌత్ పూర్తిగా విఫలమయ్యారనేది నెటిజన్ల అభిప్రాయం. అంతటి విగ్రహపుష్టి, గాంభీర్యం ఉన్న నటుడిని సరిగ్గా ఉపయోగించు కోకుండా విజువల్ ఎఫెక్ట్స్- గ్రాఫిక్స్ పేరుతో ప్రభాస్ ఇమేజ్‌ను తగ్గించేశారని అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామాయణం రిలీజ్ అయిన తర్వాత థియేటర్లలో కనిపించిన సాంకేతిక పరిణతిని చూసిన ఫ్యాన్స్.. ఆదిపురుష్ చిత్రంలో జరిగిన సాంకేతిక లోపాలను.. రామాయణ ఇతిహాసాన్ని వక్రీకరించిన తీరును తలచుకుంటూ మీడియా - సోషల్ మీడియా వేదికలలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆదిపురుష్ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎదుర్కొన్న ఘోర పరాజయం.. ఎదుర్కొన్న ప్రతికూల విమర్శల దెబ్బ నుంచి దర్శకుడు ఓం రౌత్ ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేక పోయారనేది చిత్ర పరిశ్రమలో చర్చ. ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వంలో మరే పెద్ద ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కకపోవడం లేదా విడుదల కాకపోవడం గమనార్హం. ధనుష్ కథానాయకుడిగా భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జీవిత ఆధారంగా తెరకెక్కించిన -కలామ్: ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా- బయోపిక్‌కు మాత్రమే ఆయన దర్శకత్వం వహించగా.. కొన్ని చిత్రాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఊహించని రీతిలో -ఆదిపురుష్- ఇచ్చిన భారీ షాక్ నుంచి ఓం రౌత్ కెరీర్ ఇప్పటికీ కోలుకోలేకపోవడమే కాకుండా... రామాయణ ఆధారిత కొత్త సినిమాలు వచ్చిన ప్రతిసారీ అతడు చేసిన తప్పులు మళ్లీ మళ్లీ చర్చనీయాంశమవుతున్నాయి. ఒక గొప్ప పౌరాణిక కథను సరైన విజువల్ విజన్‌తో తెరకెక్కించక పోతే ఎలాంటి ఫలితం ఉంటుందో చెప్పడానికి -ఆదిపురుష్- ఒక ఉదాహరణగా నిలవగా.. -రామాయణం- వంటి చిత్రాలు విజువల్ స్టాండర్డ్స్‌కు కొత్త కొలమానాలను నిర్దేశిస్తున్నాయనే చర్చ సాగుతోంది.

థియేటర్ల వ్యాపారంలో స్టార్ హీరో 600 కోట్లు పెట్టుబడి!



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ థియేటర్ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. తన పిల్లలు నైసా, యుగ్ పేర్లతో ప్రారంభించిన NY Cinemas ద్వారా ఇప్పటికే 25కి పైగా మల్టీప్లెక్స్‌లలో 80కి పైగా స్క్రీన్లను నిర్వహిస్తున్నారు. రాబోయే 2-3 ఏళ్లలో 250 స్క్రీన్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాజాగా తెలంగాణ, ఏపీ సీఎం లను కలసి హైదరాబాద్, వరంగల్, అమరావతి, విశాఖ పట్నం సహా పలు నగరాల్లో మల్టీప్లెక్స్‌ల ఏర్పాటుపై చర్చించినట్లు కథనాలు వస్తున్నాయి. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అగ్ర నటుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేసిన అజయ్ దేవగన్, ఇప్పుడు థియేటర్ ఎగ్జిబిషన్ రంగంలో కూడా సరికొత్త విప్లవాన్ని తీసుకువస్తున్నారు. తన బిడ్డలు నైసా యుగ్ (బన్స్) పేర్ల మొదటి అక్షరాల కలయికతో అనే మల్టీప్లెక్స్ చైన్‌ను ఆయన స్థాపించారు. కేవలం నటుడిగానే కాకుండా ఒక వ్యాపారవేత్తగా సినిమా ప్రదర్శన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా దేవగన్ ఈ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ప్రేక్షకులకు ప్రపంచస్థాయి థియేట్రికల్ అనుభూతిని అందించాలనే ధ్యేయంతో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో స్క్రీన్లను నిర్మిస్తున్నారు. అమెరికా ఎన్నికల ఎఫెక్ట్.. భారత స్టాక్ మార్కెట్లలో భారీ ర్యాలీ.. ఇన్వెస్టర్లకు రూ.6 లక్షల కోట్ల లాభం! ప్రస్తుతం -ఎన్.వై. సినిమాస్- నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటివరకు భారత్‌లోని దాదాపు 25కి పైగా మల్టీప్లెక్స్ థియేటర్లలో 80కి పైగా ఆవరేషనల్ స్క్రీన్లతో పాటు.. కొన్నిటిని నిర్మాణ దశకు ఈ సంస్థ చేర్చింది. రానున్న 2 నుండి 3 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా మొత్తం 250 స్క్రీన్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. టైర్-1 మెట్రో నగరాలతో పాటు ప్రధానంగా సినీ వినోదం తక్కువగా అందుబాటులో ఉన్న టైర్-2, టైర్-3 నగరాల పరిధిలో మల్టీప్లెక్స్ రంగాన్ని విస్తరించడం ద్వారా ప్రేక్షక వర్గాన్ని మరింత పెంచవచ్చని అజయ్ దేవగన్ ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. మెట్రోలు- ప్రధాన పట్టణాలలో ఎన్.వై. సినిమాస్ ఇప్పటికే తమ ఉనికిని చాటుకుంది. ముంబైలోని చారిత్రాత్మక సిటీలైట్ థియేటర్ స్థానంలో 3 స్క్రీన్‌లు, డాల్బీ అట్మాస్ సౌండ్‌తో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించడంతో పాటు.. గురుగ్రామ్‌లో 4-స్క్రీన్ల అల్ట్రా-లగ్జరీ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో 6 స్క్రీన్‌ల భారీ మల్టీప్లెక్స్‌తో పాటు అహ్మదాబాద్, ఆనంద్, సురేంద్రనగర్, పంజాబ్‌లోని భటిండా, రాజస్థాన్‌లోని రతన్ ఘర్, .. యూపీలోని కాన్పూర్ వంటి నగరాల్లో తమ థియేటర్ల చైన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ థియేటర్లలో నాణ్యమైన సౌండ్, లగ్జరీ సీటింగ్, సరికొత్త ఎంటర్‌టైన్‌మెంట్ కాన్సెప్ట్‌లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ భారీ విస్తరణ ప్రాజెక్ట్ కోసం అజయ్ దేవగన్ సుమారు 500 కోట్ల నుండి 600 కోట్ల వరకు పెట్టుబడులను కేటాయించినట్లు వ్యాపార వర్గాల రిపోర్టులు చెబుతున్నాయి. ఈ సంస్థకు అజయ్ దేవగన్ ఫౌండర్ కం ప్రమోటర్‌గా వ్యవహరిస్తుండగా.. రాజీవ్ శర్మ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా మల్టీప్లెక్స్‌లను నిర్మించే క్రమంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లు, మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్ యజమానులతో లాంగ్-టర్మ్ లీజింగ్ లేదా రెవెన్యూ షేరింగ్ మోడల్ ఆధారంగా భాగస్వామ్యాలు కుదుర్చుకుంటూ వ్యాపారాన్ని ముందుకు తీసుకెళుతున్నారు.ఉత్తరాదిన సక్సెస్ సాధించిన అనంతరం, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో తమ చీ సినిమాస్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించాలని అజయ్ దేవగన్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్. రేవంత్ రెడ్డిని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడిని కలిశారు. హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్లు, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలతో పాటు.. ఏపీ రాజధాని అమరావతిలో ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌లు... విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలలో అధునాతన మల్టీప్లెక్స్‌లు నిర్మించడానికి ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పనపై వారు చర్చలు జరిపినట్లు కథనాలొస్తున్నాయి.

ఔత్సాహిక నటీమణులకు ఈ నటి జర్నీ పర్ఫెక్ట్ కేస్ స్టడీ

బాలీవుడ్ నటి కృతి సనన్ తన 12 ఏళ్ల కెరీర్‌లో ఇప్పటివరకు బికినీలో నటించలేదని, ఇటీవల వచ్చిన 'కాక్‌టైల్ 2'లోనే తొలిసారి ఆ సన్నివేశంలో కనిపించానని వెల్లడించారు. కెరీర్ ప్రారంభంలో ఇలాంటి సన్నివేశాల్లో నటించేందుకు సౌకర్యంగా ఉండేది కాదని తెలిపారు. వయస్సు, అనుభవంతో పాటు తనపై తనకు నమ్మకం పెరిగిందని, శరీరాకృతి కంటే ఆత్మవిశ్వాసమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. బికినీ వేయమని లేదా హద్దుమీరి ఎక్స్‌పోజ్ చేయాలని దర్శకనిర్మాతలు ఒత్తిళ్లు తెస్తే వెంటనే దానికి ఒప్పుకోవాలా? కొందరు కథానాయికలకు ఈ విషయంలో అభ్యంతరాలున్నాయి. బోల్డ్ ఫోటోషూట్లు లేదా మితిమీరిన గ్లామర్ ఎలివేషన్ కి అందరూ అంగీకరించలేరు. బాలీవుడ్‌లో 12 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రముఖ నటి కృతి సనన్ ఇటీవల జాతీయ మీడియా వేదికగా తన వ్యక్తిగత ఎదుగుదల- ఆత్మవిశ్వాసంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తను కెరీర్ ఎప్పుడో ప్రారంభించినా కానీ, ఇటీవల వచ్చిన -కాక్‌టైల్ 2-లో తప్ప బికినీలో నటించలేదని కృతి తెలిపారు.



ఈ చిత్రంలోని బికినీ సీన్ గురించి ప్రస్తావిస్తూ.. గ్లామర్ రంగంలో ఒక నటిగా తన ఆలోచనా విధానం కాలక్రమేణా ఎలా మారిందో స్పష్టంగా చెప్పుకొచ్చారు. కృతి సనన్ తన వ్యాఖ్యలలో ప్రధానంగా మానసిక పరిణతికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎనిమిదేళ్ల క్రితం తన కెరీర్ ప్రారంభ దశలో ఇటువంటి సన్నివేశంలో నటించాల్సి వస్తే తాను ఎంతమాత్రం సౌకర్యవంగా ఫీలయ్యేదాన్ని కానని ఓపెన్‌గా అంగీకరించారు. వయస్సు పెరగడం.. పరిశ్రమలో సంపాదించిన అనుభవం.. స్వీయ వ్యక్తిత్వంపై ఏర్పడిన నమ్మకమే ఈ రోజు తనను ఈ స్థాయి సెల్ఫ్ అగ్రీ దిశగా నడిపించాయని వివరించారు. శరీర ఆకృతి గురించి మాట్లాడుతూ కృతి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. కేవలం శారీరక దారుఢ్యం కలిగి ఉండటం కంటే.. ఒక వ్యక్తి తన శరీరంలో పూర్తి సహజంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే అత్యంత కీలకమైన అంశమని నొక్కి చెప్పారు. బాహ్య సౌందర్యం కంటే అంతర్గత ఆత్మవిశ్వాసమే నిజమైన సౌకర్యాన్ని.. ధైర్యాన్ని అందిస్తుందని కృతి సనోన్ అభిప్రాయపడ్డారు.అంతేకాకుండా.. నటన - కెరీర్ విషయంలో తనకు తానే అతిపెద్ద విమర్శకురాలినని కృతి పేర్కొన్నారు. ప్రతీ సినిమా పూర్తయిన తర్వాత తన ప్రదర్శనను నిశితంగా విశ్లేషించుకుంటూ.. లోపాలను సరిదిద్దుకుంటూ మరింత మెరుగ్గా రాణించేందుకు నిరంతరం ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ గ్రోత్ మైండ్‌సెట్ వల్లనే తాను నటిగా.. వ్యక్తిగా నిలకడైన పురోగతి సాధించగలిగానని వెల్లడించారు. కృతి సనన్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొనే బాడీ ఇమేజ్ ఒత్తిడులు, వ్యక్తిగత ఎంపికల స్వేచ్ఛ.. వయస్సుతో పాటు వచ్చే ఆత్మవిశ్వాసంపై సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి. పరిశ్రమలోని ప్రమాణాల కోసం కాకుండా..తమ మానసిక సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకోవడం ఎంత అవసరమో ఔత్సాహిక నటీమణులకు అర్థమయ్యేలా కృతి చెప్పారు. కృతి తదుపరి మడాక్ ఫిలింస్ లో హారర్ చిత్రంలో నటిస్తోంది. భేధియా 2 లోను నటిస్తోంది.

బుకింగ్స్ లో 'రామాయణ' సెన్సేషన్.. వరుసగా రెండో రోజు కూడా రికార్డు!

బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీరా కపూర్ హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కించిన భారీ విజువల్ వండర్ నే రామాయణ. ఎన్నో అంచనాలు సెట్ చేసుకుని వచ్చిన ఈ సినిమా భారీ ఓపెనింగ్స్ ని సాధించి ఈ ఏడాదిలో మరో రికార్డు సెట్ చేసింది. అయితే ఇండియా వరకు రిలీజ్ అయ్యిన రోజే 24 గంటల్లో 1 మిలియన్ కి పైగా టికెట్ సేల్స్ ని జరుపుకొని అదరగొట్టిన ఈ సినిమా రేర్ ఫీట్ ని సెట్ చేసింది. తెలుగు సినిమా వార్తలు ఒక్క బుక్ మై షో నుంచే రామాయణ సినిమా 1 మిలియన్ బుకింగ్స్ ని క్రాస్ చేయగా ఇప్పుడు వరుసగా రెండో రోజు కూడా 1 మిలియన్ టికెట్ సేల్స్ ని క్రాస్ చేసి రెండో రోజు కూడా సెన్సేషన్ ని సెట్ చేసింది. దీనితో ఆదరణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ వారాంతం శనివారం, ఆదివారం బుకింగ్స్ కూడా మరింత లెవెల్లో ఉంటాయి. ఇక వసూళ్లు ఏ స్థాయిలో ఉంటాయో చూడాలి. ఇక ఈ సినిమాకి రెహమాన్, హన్స్ జిమ్మర్ లు సంగీతం అందించగా నమిత్ మల్హోత్రా నిర్మాణం వహించారు.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryuduedtor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555